మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట





మామిళ్ళపల్లిలో భారీ జన సమూహం, కేరింతల మధ్య జరిగిన రథోత్సవం

# మామిళ్ళపల్లిలో ఘనంగా రథోత్సవం

**ఉప్పునుంతల, మార్చి 4 ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేకువ జామున ఘనంగా రథోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ రకాల పూలతో అలంకరించి, విద్యుత్ దీపాలతో అలంకరించిన రథాన్ని విశేష జనం మధ్యలో రథోత్సవం ( తేరు) కార్యక్రమం నిర్వహించారు. వైభంగా జరిగిన రథోత్సవం కార్యక్రమానికి మామిళ్ళపల్లి గ్రామ పరిసర ప్రాంతాలైన లక్ష్మాపూర్, దాసర్లపల్లి, పెద్దాపూర్, ఉప్పరపల్లి, సదగోడు, మొల్గర, మర్రిపల్లి తదితరగ్రామాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. దీంతో అలయప్రాంగణం కిక్కిరిసి పోయింది. అంతకు ముందు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిత్య హోమములు, బలి హరణం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి.

**ఘనంగా ట్రాక్టర్స్ రివర్స్ పోటీలు**

మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ట్రాక్టర్స్ రివర్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

**భారీ బందోబస్తు...**

మంగళవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రథోత్సవం కార్యక్రమానికి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నేడు అంత రాష్ట్ర వృషభ రాజులచే బండ లాగుడు పోటీలు.....నేడు గురువారం అంత రాష్ట్ర బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, కార్యనిర్వాహణాధికారి నర్సింహులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు హాజరయ్యే వారికి ఎ.యం.ఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రతినిధులు మాజీ జడ్పిటిసి అనంత ప్రతాపరెడ్డి, సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి వారి సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 4 ప్రభాతవార్త:** తాడూర్ మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, హాల్ టికెట్ల తనిఖీ, బందోబస్తు ఏర్పాట్లు తదితర విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం - మిగతా3లో..



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



ఇసుక తరలించేందుకు నదిలోనే రోడ్డు వేసిన దృశ్యం

### కృష్ణా నదిలో యథేచ్ఛగా

# అక్రమ ఇసుక తవ్వకాలు

- టిప్పర్ తిరిగేందుకు నదిలోనే రోడ్డు
- ఇసుకను కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్న మాఫియా
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖలు
- అక్రమాలను ఆపాలని ప్రజల డిమాండ్



జెసిబి సహాయంతో ఇసుక తవ్వుతున్న దృశ్యం

**మాగనూర్,/కృష్ణ, మార్చి 3 ప్రభాతవార్త:** కృష్ణా నదిలో అక్రమార్కులు ఇసుకను అర్ధరాత్రి యథేచ్ఛగా తోడేస్తున్నారు. నారాయణపేట జిల్లా, కృష్ణమండలం ముడుమాల్, టైరోడ్, వాసునగర్, గుర్జల్ గ్రామాలలో అక్రమ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అర్ధరాత్రి హిటాచిల ద్వారాటిప్పర్లకు ఇసుకను నింపి కర్ణాటక రాష్ట్రం, సైదాపూర్, యాదగిరి, గుల్బర్గా వరకు ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కోటిప్పర్‌కు ఇరవై వేల నుండి నలభైవేలవరకు ధర పలుకుతున్నట్లు సమాచారం. కృష్ణానదిలో ఇసుక తీసేందుకు ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకపోవ డంతో అక్రమార్కుల వ్యాపారం లాభసాటిగా నడుస్తుంది. అర్ధరాత్రి బ్లాక్ దందా జీరోలో నడపడంతో రీచ్ ఓనర్లకు కాసుల పంట పండుతుంది. అధిక లాభాలకు అలవాటు పడ్డ ఓనర్లు మైనింగ్, రెవెన్యూ, పోలీస్ ఆఫీసర్లను వారి గుప్పెట్లో పెట్టుకుని అక్రమ ఇసుక రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమాలను ఆపాల్సిన అధికారులు బాధ్యతయుతంగా పనిచేసి ప్రజా వనరులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**నదిలో రోడ్డు....**

నదిలో ఇసుక అమ్ముకొని భారీగా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో అక్రమార్కులు ఏకంగా నదిలోనే రోడ్డు వేశారు. ఇసుకాసురులకు ఎవరు అడ్డు కాదని అర్థమవుతుంది. కృష్ణ మండలంలో ఇల్లీగల్ రీచులలో ఇసుక నడుస్తుందని, అడ్డుకునేందుకు తహసిల్దార్ -మిగతా3లో..

**అధికారులు స్పందిస్తలేరు..**



కృష్ణ మండలం గుర్జల్ గ్రామ శివారులోని సిద్ధ లింగేశ్వర మఠం దగ్గర నది నుండి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను డంపు చేసి రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తున్నారు. అక్రమాలను అడ్డుకోవాలని సంబంధిత రెవెన్యూ, పోలీస్ ఆఫీసర్లకు సమాచారం ఇచ్చిన స్పందిస్తలేరు. 100 డయల్ కు కాల్ చేస్తే గానీ రాలేని పరిస్థితి. అక్రమాలకు అధికారులు సహకరించడం సరైంది కాదు. ప్రజలు సమాచారం ఇచ్చిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించాలి.

*శివరాజ్ పాటిల్, గుర్జల్ గ్రామం*

# కౌకుంట్లకు ఇందిరమ్మ కళ

- కొత్త ఇళ్ల ప్రారంభానికి నేడు దేవరకద్ర ఎమ్మెల్యే రాక
- ముస్తాబు చేస్తున్న లబ్ధిదారులు
- ఇందిరమ్మ ఇండ్లు అందించినందుకు లబ్ధిదారుల ఆనందం



కొత్త ఇంటి వద్ద రాజమురీ బాలేశ్వరి

**దేవరకద్ర, మార్చి 4 ప్రభాతవార్త:** అది నూతనంగా ఏర్పడిన కౌకుంట్ల మండలం వ్యవసాయానికి కేంద్ర బిందువు. అన్ని రేకుల ఇల్లు. వాన వస్తే ఓ మూలన కురుస్తుంటే, మరో మూలన దిగులుగా కూర్చునే బతుకులు. ఇప్పుడా గ్రామానికి కొత్త వెలుగు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంతో అనేక కుటుంబాల సొంతింటి కల నెరవేరుతుంది. పూర్తయిన గృహాల ప్రవేశాలకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి వస్తుండడంతో లబ్ధిదారులు మా గృహప్రవేశాలకు రండి అంటూ.. తమ బంధువులను పిలుస్తున్నారు.

**మొత్తం 37 ఇండ్లు మంజూరు...**

కౌకుంట్లకు రాష్ట్ర ప్రభుత్వం 37 ఇండ్లు మంజూరు చేసింది. సర్కారు విడతలవారీగా డబ్బులు విడుదల చేస్తుంది. పునాది, రూఫ్, స్లాబ్ దశ (1+1+2)లో మొత్తం నాలుగు లక్షల ఇప్పటికే జమయ్యాయి. ఫ్లోరింగ్ తలుపులు, కిటికీలు, బిగించి రంగులువేసిన ఇళ్లకు తుది విడతగా లక్ష ఇస్తున్నారు. ఇప్పటివరకు 20ఇండ్లు చెత్తు లెవల్ పూర్తయ్యాయి. 12 నిర్మాణ దశలో ఉన్నాయి. మరో ఐదు ఇండ్లు నిర్మాణంలో జాప్యం నెలకొంది. నేడు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి రానున్న నేపథ్యంలో కౌకుంట్ల మండలానికి నూతన కళ వచ్చింది. ఇందిరమ్మ గృహానికి దేవరకద్ర ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించనున్నారు.

**బాధలు తప్పాయి..**

నా పేరు సుంత్రమోని బోజ్జమ్మ. నాకు ఒక బిడ్డ ఒక కుమారుడు. మా కుమారుడు ఎనిమిది నెలల వయసున్నప్పుడే మా ఆయన ఎటో వెళ్లిపోయి, మళ్లీ రాలేదు. ఎన్నో కష్టాలు పడి కుమారుడిని పెంచుకున్న. ఎదిగిన కుమారుడికి పెళ్లి చేద్దామంటే ఇల్లు లేదు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి, ఇప్పటికే మూడు లక్షలు ఇవ్వగా, మరో లక్ష రూపాయలు సారు ఫోటో దింపుకు పోయిండు. అవి కూడా రేపు సోమవారం పడతాయి అన్నారు. మాకు చాలా సంతోషంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

**మూడు నెలల్లోనే సొంతిల్లు సమకూరుంది...**

నా పేరు రాజమూరి బాలేశ్వరి ఆంజనేయులు, నాకు ముగ్గురు పిల్లలు. నా భర్త మేస్త్రీ పని చేస్తుంటాడు, నేను కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాము. చిన్న రేకుల షెడ్డులో ఇన్నాళ్లు జీవనం సాగించాం. దరఖాస్తు చేసుకోగానే ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయింది. మూడు నెలల్లోనే సొంతింటి కల సహకారం -మిగతా3లో..

### వంద శాతం ఉత్తీర్ణతతో

# జిల్లాకు పేరు తీసుకురావాలి

**గద్వాల, మార్చి 4, ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై మంచి ఫలితాలు సాధించడానికి వివిధ అంశాలను తెలియజేస్తూ ప్రేరణ కలిగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పలువురు విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభ్యాసన స్థాయిని తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని, ఇందులో మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత చదువులకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేలా విద్యార్థులు ప్రణాళికతో చదవాలని సూచించారు. ప్రస్తుతం పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో ప్రతి రోజూ సమయాన్ని సక్రమంగా వినియోగించుకొని చదువుపై పూర్తి దృష్టి పెట్టాలన్నారు. అన్ని సబ్జెక్టుల్లో మంచి ఫలితాలు సాధించాలంటే పాఠాలను అర్థం చేసుకుని చదవాలన్నారు. ముఖ్యంగా పాత ప్రశ్నాపత్రాలను చదివి, వాటికి సమాధానాలను వ్రాయడం ద్వారా మంచి ప్రాక్టీస్ వస్తుందనన్నారు. పరీక్షల్లో చేతివ్రాత స్పష్టంగా ఉండేలా సాధన చేయాలని సూచించారు. క్లిష్టంగా అనిపించే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పదే పదే చదవడం, వ్రాయడం ద్వారా ఆయా సబ్జెక్టులపై పట్టు సాధించవచ్చని సూచించారు. తాను పదవ తరగతిలో ఎలా ప్రిపేర్ అయ్యారో, ప్రతి సబ్జెక్టును ఏ విధంగా చదివి మంచి ఫలితాలు సాధించారో ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో పంచుకున్నారు. పరీక్షలను ఆత్మవిశ్వాసం తో రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ కలెక్టర్ స్వయంగా రాసిన "విజయోస్తు" లేఖలను పలువురు విద్యార్థులకు అందించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రేణుక దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్



వివరాలు వెల్లడిస్తున్న డి.ఎస్.పి వెంకటేశ్వర్లు

### జల్సాలకు అలవాటు పడి

# దొంగతనాలు

**అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టు రట్టు**

**పోలీసుల అదుపులో నిందితులు**

**జడ్చర్ల పోలీస్ స్టేషన్లో వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి**

**కేసును ఛేదించిన సీఐ,ఎస్ఐ, కానిస్టేబుల్‌లకు అభినందన**

**జడ్చర్ల, మార్చి 4 ప్రభాతవార్త :** జల్సాలకు అలవాటు పడి చైన్ స్నాచింగ్‌కి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు మహబూబ్‌నగర్ డి.ఎస్.పి వెంకటేశ్వర్లు తెలిపారు. జడ్చర్ల పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత నెల 27న జడ్చర్ల కృష్ణారెడ్డి కాలనీలోని ఓ కిరాణం దుకాణం వద్ద వాటర్ బాటిల్ కోసం వెళ్లి ఓ మహిళా మెడలో నుంచి రెండు తులాల పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. ఈ మేరకు జడ్చర్ల సిఐ కమలాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. జడ్చర్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా ఏటిగడ్డ పల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ, షేక్ ఇసాక్, లక్ష్మణ్ నాయక్ గా గుర్తించారు. వీరి గురించి విచారించగా.. - మిగతా2లో..

### పెళ్లి అయిన వ్యక్తితో ప్రేమాయణం..

# బిడ్డకు జననం

**పోలీసుల విచారణలో ఒప్పుకున్న మైనర్ బాలిక**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 4 ప్రభాతవార్త:** మైనర్ అమ్మాయి ప్రేమాయణం కేసు ఊహించని మలుపు తిరిగింది. అందుకు సంబంధించిన వివరాలను నాగర్‌కర్నూల్ డిఎస్పి బుర్రి శ్రీనివాసులు బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మైనర్ అమ్మాయి మొదటగా 10వ తరగతిలో పరిచయమైన మైనర్ అబ్బాయి తన గర్భానికి కారణమని చెప్పింది. పోలీసులు మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించగా తాను ఎలాంటి తప్పు చేయలేదని మైనర్ బాలుడు పోలీసులకు వివరించారు. దీంతో మహిళ ఎస్సై కానిస్టేబుల్‌తో మరోసారి మైనర్ బాలికను విచారించగా ఊర్లోని ఇంటి పక్కన తమ బంధువైన గంగరాజు(24) తన గర్భానికి కారణమైన వ్యక్తి అని పోలీసుల విచారణలో చెప్పింది. పోలీసులు గంగరాజును విచారించగా తానే మైనర్ బాలికను గర్భవతి చేసినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు అతనిపై పోక్సో కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు నాగర్‌కర్నూల్ డిఎస్పి తెలిపారు.




నాగర్‌కర్నూల్ డిఎస్పి బుర్రి శ్రీనివాసులు

### మార్చి 6 నుంచి జూన్ 12 వరకు

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

**నారాయణపేట, మార్చి 4 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" పేరుతో 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాఖల వారీగా 10 థీమ్‌లతో కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ యాక్షన్ ప్లాన్‌ను అయిదు దశల్లో అమలు చేయనున్నారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమం, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమం, మే 22న జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలతో ముఖ్య కార్యక్రమాలు కొనసాగనున్నాయి. శాఖల వారీగా పరిసరాల పరిశుభ్రత, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, ఆరోగ్యం - మిగతా3లో..




మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి

### పరిసరాలను పరిశీలించి..

# విద్యార్థినులతో ముచ్చటించి..

**జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బి.సి బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశం**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, మార్చి 4 ప్రభాతవార్త:** మెనూ పక్కాగా అమలు చేస్తూ విద్యార్థినిలకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ బంగ్లా సమీపంలో ఉన్న ప్రభుత్వ బి.సి బాలికల సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతిగృహంలో భోజనం మెనూ ప్రకారం అందించాలని, అలాగే వసతిగృహంలో పరిశుభ్రతను పాటించాలని అధికారులకు సూచించారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ వసతి గృహంలోని కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, డార్మిటరీ గదులు, మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారికి డైట్ ప్రకారం రుచికరమైన, పోషకాహారం అందుతున్నదా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థుల సంఖ్య, గదుల సంఖ్య, విద్యార్థులు ఎలా చదువుతున్నారు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, ప్రస్తుతం వసతి గృహంలో సుమారు 250 మంది బాలికలు నివసిస్తున్నామని, అయితే డార్మిటరీ గదులు తగినంతగా లేవని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పంచాయతీ రాజ్ ఈఈ కి పరిశీలించేందుకు తగు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని, తాగునీటిలో పి.పి.ఎం శాతాన్ని తరచూ పరీక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. టెన్త్ క్లాస్ చదువుతున్న ఒక విద్యార్థిని మాట్లాడుతూ, తాము మార్కెట్ రోడ్ పాఠశాలలో చదువుతున్నామని, తెలుగు, హిందీ, బయో సైన్స్ ఉపాధ్యాయుల కొరత ఉందని తెలిపారు. ఈ విషయంపై కూడా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడతానని కలెక్టర్ తెలిపారు. అదనంగా, వసతి గృహంలోని బోర్‌వెల్ మరమ్మతులు, సీసీ కెమెరాల వ్యవస్థ, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై కూడా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరంభోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, డైట్ మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని, సమయపాలన పాటించాలని, వసతి గృహంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి ఆదేశించారు.



విద్యార్థినులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా



వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

### పదిలో వంద శాతం

# ఉత్తీర్ణత సాధించాలి

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, మార్చి 4 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు వంద శాతం పాస్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ పెద్దమందడి మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ గర్ల్స్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా -మిగతా3లో..

## ఘనంగా రజిని సాయిచంద్ జన్మదిన వేడుకలు



రజిని సాయి చందు జన్మదిన వేడుకల దృశ్యం

**అమరచింత మార్చి 4, ప్రభాతవార్త:** రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్పర్సన్ రజిని సాయి చందు జన్మదిన వేడుకల సందర్భంగా బుధవారం టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కళాకారులు దివంగత సాయి చంద్ విగ్రహం దగ్గర రజిని సాయి చందు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే డిఎంఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. అమరచింత జడ్పీహెచ్ఎస్ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రాజేందర్ సింగ్, ఆత్మకూర్ మాజీ మార్కెట్ చైర్మన్ ఎస్ ఏ రాజు, టిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ తిరుమలేష్, లక్ష్మి హర్ష వెంకటేష్, మాజీ కౌన్సిలర్ బి ఎస్ రాజకుమార్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేజీ జయసింహారెడ్డి, డీజే శేఖర్, బాలరాజ్, నాగభూషణం గౌడ్, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలను సందర్శించిన యంఈఓ



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న మండల విద్యాధికారి

**దామరగిద్ద, మార్చి 4 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల కంసాన్‌పల్లిని మండల విద్యాధికారి కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. సందర్శనలో భాగంగా 3వ తరగతి విద్యార్థుల ఎఫ్ ఎల్ ఎస్ మార్క్‌టెస్ట్‌ను సమీక్షించి, వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు. అలాగే 4వ తరగతి గది బోధనను ప్రత్యక్షంగా వీక్షించి, బోధనా విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు మరియు హెడ్మాస్టర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించి, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరచడానికి తగు సలహాలు, సూచనలు అందించారు. విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు నరేష్, లఖాన్, నర్సింలు, గోవిందు తదితరులు ఉన్నారు.

## మేరా యువభారత్ ఆధ్వర్యంలో యువ మండల్ వికాస్ అభియాన్ కార్యక్రమం



అభ్యర్థన అప్లికేషన్ ఫారం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, మార్చి 4 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఉట్కూర్ మండలం ఏడవెల్లి గ్రామంలో మేరా యువభారత్ ఆధ్వర్యంలో యూత్ క్లబ్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా యువ మండల్ వికాస్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ యువజన సంఘాల అభివృద్ధి లక్ష్యంగా సంస్థ అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. గ్రామాలలో ఉన్న యువజన సంఘాలు అన్నీ మేరా యువభారత్‌తో అనుసంధానం కావాలని, అలా అనుసంధానం కావడం వల్ల యువజన సంఘాలకు ప్రోత్సాహకాలు, శిక్షణా కార్యక్రమాలు, అభివృద్ధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. రాబోయే రోజుల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన యువజన సంఘాలకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా యువ శక్తి యూత్ అసోసియేషన్ తరఫున అభ్యర్థన అప్లికేషన్ ఫారం సమర్పించబడింది. కార్యక్రమంలో యువ శక్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అంజప్ప, రాజు గౌడ్, కల్పన, అనిత, నరేష్ తదితరులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరంలో పాల్గొన్న గ్రామ సర్పంచులు



ఆర్‌డబ్ల్యూఎస్ అచ్చంపేట డివిజన్ అధికారిణి హేమలతతో మండలంలోని సర్పంచులు

**ఉప్పునుంతల, మార్చి 4 ప్రభాతవార్త :** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన గ్రామ సర్పంచులకు జిల్లా కేంద్రంలోని నిర్వహిస్తున్న శిక్షణ శిబిరానికి హాజరయ్యారు. ఈ శిక్షణ శిబిరంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ పై అవగాహన కల్పించారని ఈ శిక్షతో తమకు గ్రామ పంచాయతీ విధులు, నిధులు పట్ల అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీలో పరిపాలన పట్ల తమకు పూర్తి అవగాహన కలిగే విధంగా శిక్షణ ఇవ్వడం జరిగిందని ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి, బొజ్జ గీత అమరేందర్ రెడ్డి, చింతోజు వెంకటేష్‌లు వివరించారు. అదే విధంగా మిషన్ భగీరథ తదితర కార్యక్రమాలపై డిఈఈ హేమలత అవగాహన కల్పించారని వారు పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో వారితో పాటు గ్రామ సర్పంచులు వీరోజు సుప్రియ, శ్రీకాంత్, గోపాల్, వాల్యా నాయక్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.80.5 లక్షలు మంజూరు

### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కి ధన్యవాదాలు

### కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ అధ్యక్షుడు ద్యాప నిఖిల్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ అధ్యక్షుడు ద్యాప నిఖిల్‌రెడ్డి

**ఊర్కొండ, మార్చి 4 ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా గతంలో ఎన్నడూ లేనంతగా నిధులను విడుదల చేస్తూ గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుద్ రెడ్డికి మాదారం గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ఉరుకొండ మండల అధ్యక్షుడు ద్యాప నిఖిల్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సమ ప్రాధాన్యతనిస్తూ కోరుకొండ మండలానికి తాజాగా సిసిరోడ్ల నిర్మాణానికి రూ.80.5 లక్షలు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పల్ గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సిసి రోడ్లు డ్రైనేజీలకు నిధులు మంజూరు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సాంప్రదాయ బద్ధంగా హోలీ వేడుకలు



హోలీ సంబరాల్లో యువకులు



ఉప్పునుంతలలో రంగేలి కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

**ధన్వాడ, మార్చి 4 ప్రభాతవాకంత :** ధన్వాడ మండలంలో నిన్న చంద్రగ్రహణం ఉండటంతో పలు గ్రామాలలో బుధవారం హోలీ పండుగను గ్రామస్థులు సాంప్రదాయ బద్ధంగా అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ కలసి రంగులు చల్లుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఉదయం నుంచే గ్రామ వీధులన్నీ రంగులతో కళకళలాడాయి. యువత నీటి పిచ్కారీలతో సందడి చేస్తే, చిన్నారులు రంగుల పొడులతో కేరింతలు కొట్టారు. గ్రామంలోని పెద్దలు కూడా పండుగలో పాల్గొని, ఐక్యతకు ప్రతీకగా ఒకరికి ఒకరు రంగులు రాసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ వేడుకల సందర్భంగా గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

**హోలీ సందర్భంగా జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఇస్కాన్ పూజారి**

**నారాయణపేట, మార్చి 4 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రం లో హోలీ పండుగ సందర్భంగా బుధవారం ఇస్కాన్ హరే రామ హరే కృష్ణ పూజారి అడ్మిద్ నరసింహ దాస్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. వినీత్ ని మర్యాదపూర్వకంగా కలసి, కలర్‌తో బొట్టు పెట్టి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ పూజారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా హోలీ పండుగను జరుపుకుంటామని తెలిపారు. హోలీ పండుగను శాంతి, సామరస్యాల ప్రతీకగా భావించి ప్రతి ఒక్కరూ ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు. సహజసిద్ధమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని, రసాయనిక రంగులను దూరంగా ఉంచాలని తెలిపారు. పండుగ సందర్భంగా ఎవరూ అనవసరంగా ఇబ్బందులకు గురికాకుండా పరస్పర గౌరవంతో వ్యవహరించాలని కోరారు.

**ఘనంగా రంగేళి**

**ఉప్పునుంతల, మార్చి 4 ప్రభాతవార్త :** మండలంలో బుధవారం రంగేళి కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలో సోమవారం రాత్రి కామ దహనం కార్యక్రమం నిర్వహించారు. మరుసటి రోజు హోలీ సంబరాలు జరుపు కోవాల్సి ఉండగా మంగళవారం చంద్రగ్రహణం ఉండడంతో బుధవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున గ్రామాల్లో వివిధ రకాల రంగులతో వీధుల గుండా రంగేళి కార్యక్రమం జరుపుకున్నారు. సోదరా భావంతో ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులతోపాటు మహిళలు రంగులు చల్లుకొని సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, వివిధ సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పెనిమిళ్ళ లో గ్రామ సర్పంచు మెడసాని శ్రీలత విజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పాల్గొన్న మహిళలు

## గ్రామ ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి గున్ముక్ల గ్రామపంచాయతీ

### - సర్పంచ్ అనంతమ్మ అయ్యప్ప రెడ్డి




గున్ముక్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

**ధన్వాడ, మార్చి 4 ప్రభాతవార్త :** గున్ముక్ల గ్రామపంచాయతీ పరిధిలో రాజ్యాంగబద్ధమైన, పారదర్శక సమన్వయ పరిపాలన అమలుకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని సర్పంచ్ శ్రీమతి చంద్ర నూల్ల అనంతమ్మ అయ్యప్ప రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ప్రెస్ ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243జీ ప్రకారం గ్రామపంచాయతీలు స్వయం పాలనా సంస్థలుగా రాజ్యాంగబద్ధ హోదా పొందినవని ఆమె పేర్కొన్నారు. అలాగే తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం–2018 ప్రకారం గ్రామ పరిధిలోని నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు స్థానిక పరిపాలన అంశాలు గ్రామపంచాయతీ అధికార పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గృహ నిర్మాణ అనుమతులు, భూమి మార్పులు (మ్యూటేషన్లు), లేఅవుట్ అనుమతులు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా రహదారులు మరియు సామూహిక భూముల వినియోగం వంటి అంశాలకు సంబంధించి ఏ ప్రభుత్వ శాఖకు దరఖాస్తులు వచ్చినా సంబంధిత అధికారులు గ్రామపంచాయతీకి ముందస్తుగా అధికారిక సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పరిధిలో అక్రమ మట్టి తరలింపు, గుట్టలు తవ్వడం, ప్రభుత్వ లేదా సామూహిక భూముల ఆక్రమణ వంటి చర్యలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం–1957 మరియు రాష్ట్ర నిబంధనల ప్రకారం ఇటువంటి చర్యలు శిక్షార్హమని తెలియజేశారు. అక్రమ తవ్వకాలు లేదా మట్టి రవాణా గమనించిన పక్షంలో సంబంధిత రెవెన్యూ, పోలీస్ మరియు గనుల శాఖలకు అధికారిక సమాచారం అందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ ప్రకటన ద్వారా ఎవరినీ విమర్శించడం లేదా ఏ శాఖ అధికారాన్ని ప్రశ్నించడం ఉద్దేశ్యం కాదని, రాజ్యాంగబద్ధ స్థానిక స్వపరిపాలన వ్యవస్థను బలోపేతం చేయడం, గ్రామాభివృద్ధి మరియు సమన్వయ పరిపాలన కొనసాగించడమే ప్రధాన లక్ష్యమని సర్పంచ్ స్పష్టం చేశారు. సమన్వయం – పారదర్శకత – చట్టబద్ధ పరిపాలన" అనే సూత్రాల ఆధారంగా గున్ముక్ల గ్రామపంచాయతీ ముందుకు సాగుతుందని ఆమె తెలిపారు.

## అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు..

### యూత్ కాంగ్రెస్ నాయకుడు నర్సింహ యాదవ్‌పై నమోదు చేసిన కేసు నేపథ్యంలో కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజు



నర్సింహ యాదవ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజు

**జడ్చర్ల, మార్చి 4 ప్రభాతవార్త :** అధైర్య పడొద్దని పార్టీ పరంగా అండగా ఉంటామని జడ్చర్ల కు చెందిన యువ నాయకుడు నరసింహ కుటుంబానికి డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ భరోసానిచ్చారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని కావేరమ్మపేటకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు నర్సింహ యాదవ్ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఏఐ ఇంపాక్ట్ సుమ్మిట్ 2026 కార్యక్రమం సందర్భంగా జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నేపథ్యంలో, బీజేపీ ప్రభుత్వం ఆయనపై కేసు నమోదు చేయడం తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజు బుధవారం నర్సింహ యాదవ్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, మండల అధ్యక్షులు బుర్ల వెంకటయ్య, టౌన్ ప్రెసిడెంట్ సయ్యద్ మీనాజ్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ యాదవ్ ఉన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో ఎంఈఓ ప్రత్యేక సమావేశం

### - పాఠశాలల వివరాలు వెంటనే సమర్పించాలని కరస్పాండెంట్లకు ఎంఈఓ సూచన



ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్న ఎంఈఓ

**భూత్పూర్, మార్చి 4, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేట్ పాఠశాలలు తమ పాఠశాలల వివరాలు, సంబంధిత అటాచ్డ్ కాపీలతో వెంటనే తమ కార్యాలయంలో సమర్పించాలని భూత్పూర్ మండల విద్యాధికారిణి పి ఉషారాణి మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవన్‌లో మండల ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో ప్రత్యేకసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉషారాణి మాట్లాడుతూ కొందరు కరస్పాండెంట్లు తమ పాఠశాలల వివరాలు ప్రభుత్వం తెల్పిన 32 అంశా లతో కూడిన ఫార్మట్‌ను ప్రింట్ తీసుకుని అన్ని వివరాల ను నింపి సంబంధిత డాక్యుమెంట్స్ అటాచ్‌తో వీలైనంత వెంట నే సమర్పించాలని సూచించారు. మూడో తరగతి విద్యార్థులకు రాష్ట్రవిద్యాశాఖ ఆదేశాలమేరకు ఎఫ్ఎల్ఎస్ మార్క్‌టెస్ట్ వెంటనే నిర్వహించాలని ఆదేశించారు. మార్క్‌టెస్ట్ వివరాలను ట్యాబ్‌లో పొందుపరిచి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీలు ఠాగూర్, ఇక్రమ్, నాగేందర్ తదిరతులు పాల్గొన్నారు.

## జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

మొదటి పేజీ తరువాయి భాగం..



నిందితులనుంచి స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులు

జల్సాలకు ఆన్లైన్ గేమ్లు పేకాట ఆడడానికి ఈజీ మనీ ని వేదికగా చేసుకొని కాలం గడిపే వారిని, అప్పులు తీర్చడానికి దొంగతనాలకు అలవాటు పడినట్లు తెలిపారు. ఫిబ్రవరి 16న కర్నూల్లో ఒక బైకు దొంగలించారని, మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కున్నారని, ఉదాహరణ 25న ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో యూనికాన్ బైక్ దొంగతనం చేసినట్లు పలు కేసులు నమోదయ్యాయి. పోలీసుల విచారణలో ఈ దొంగతనాలు వీళ్ళే చేసినట్లు ఒప్పుకోవడంతో వారిని రిమాండ్ కు తరలించినట్లు డీఎస్పి వెంకటేశ్వర్లు తెలిపారు. కేసు విచారణ వేగవంతం చేసిన సిఐ కమలాకర్, ఎస్ఐ మల్లేష్ కానిస్టేబుల్ విష్ణు, మన్సూర్ నరసింహ డీఎస్పి అభినందించారు.

## జాతీయ చేనేత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**గద్వాల మార్చి 04, ప్రభాతవార్త :** జిల్లాలోని చేనేత కార్మికులకు 2025 సంవత్సరానికి గాను చేనేత వృత్తిలో నైపుణ్యం కలిగి ఉన్న చేనేత కార్మికులకు, జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద సంత్ కబీర్ అవార్డు, జాతీయ చేనేత అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. సంత్ కబీర్ అవార్డు అర్హతలు:గతంలో జాతీయ లేదా రాష్ట్ర స్థాయి అవార్డు పొందిన చేనేత కళాకారులు/డిజైనర్లు అర్హులు. 3112 2025 నాటికి కనీసం 50 సంవత్సరాల వయస్సు ఉండి చేనేత రంగంలో కనీసం 20 సంవత్సరాల అనుభవం ఉండాలి. జాతీయ చేనేత అవార్డు అర్హతలు:చేనేత కళాకారుల 31122025 నాటికి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉండి, చేనేత రంగంలో కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలి. ఇతర రంగాల కళాకారులు 31122025 నాటికి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉండి చేనేత రంగంలో కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలి. ఆసక్తి కలిగిన చేనేత కార్మికులు వీవింగ్ డిజైనింగ్ కేటగిరి కింద అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు కాపీలను చేనేత సేవా కేంద్రం, వీవర్స్ సర్వీస్ సెంటర్, చేనేత భవన్, 2వ అంతస్తు, నాంపల్లి, హైదరాబాద్ లో సమర్పించి, సంబంధిత జిల్లా కార్యాలయానికి సమాచారం అందజేయాలని సూచించారు.

## మద్దూరులో రంగుల సందడి

### ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు



**మద్దూరు, మార్చి 4 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలోని అమర్ గడ్డ ప్రాంతంలో బుధవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు రంగుల హరివిల్లు వాతావరణాన్ని సృష్టించాయి. యువకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని పరస్పరం రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. హోలీ సందర్భంగా యువత పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి సందడి చేశారు. కార్యక్రమం మొత్తం క్రమశిక్షణతో, స్నేహభావంతో కొనసాగడం విశేషం. ఈ సందర్భంగా నిర్వాహకులు మాధవ్ గౌడ్ మాట్లాడుతూ హోలీ పండుగ మన సంస్కృతిలో ఐక్యతకు, స్నేహానికి ప్రతీక అని పేర్కొన్నారు. భిన్న వర్గాలకు చెందిన ప్రజలు కలిసి పండుగను జరుపుకోవడం ద్వారా సామరస్య భావన మరింత బలపడుతుందని తెలిపారు.

# వైభవంగా శ్రీశ్రీ రంగనాయకస్వామి రథోత్సవం





రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డి, రాజా కృష్ణ దేవరావు

**శ్రీరంగాపూర్, మార్చి4 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ రంగనాయక స్వామి వారి రథోత్సవం బుధవారం ఎంతో వైభవంగా జరిగింది. రాజవంశ రాజా కృష్ణ దేవరావుతో పాటు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి వేలాది మంది భక్తులతో అంగరంగ వైభవంగా కొనసాగింది. రంగనాయక స్వామి జాతర 15 రోజులపాటు కొనసాగుతుంది. తెలుగు సంవత్సరం ఉగాది పండుగ కు ఒక రోజు ముందు శ్రీ రంగనాయక స్వామి జాతర ఉత్సవాలు ముగుస్తాయి. శ్రీ శ్రీ రంగనాయక స్వామి రథోత్సవ కార్యక్రమంలో గ్రామ ప్రజలే కాకుండా ఇతర జిల్లాల రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ఇక్కడికి రావడం విశేషం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా తగిన వసతులను కల్పించారు. భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం, త్రాగునీరును శ్రీరంగాపూర్ గ్రామ సేవా సమితి వారు ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. సేవా సమితి వారు అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ వారికి శాశ్వతంగా ఒక స్థలాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి మాట్లాడుతూ భక్తులకు రంగనాయక స్వామి రథోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ అందరూ సంతోషంగా ఉండాలని రంగనాయక స్వామి ఆశీస్సులు ఎల్లవేళల అందరికీ ఉండాలని రంగనాయక స్వామి దేవాలయం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడు అందిస్తూ ఉంటానని పేర్కొనడం జరిగింది.

**హోలీ పండుగ రోజే రథోత్సవం జరగడం శ్రీరంగాపురం ప్రత్యేకం**

**రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డి, రాజా కృష్ణ దేవరావు**

**గ్రామ సేవా సమితి వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం**



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే




## కల్వకుర్తిలో హోలీ సంబురాలు

**కల్వకుర్తి, మార్చి4 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో హోలీ పండుగ సంబురాలు అంబరాన్నంటాయి. బుధవారం కల్వకుర్తి ఆర్యవైశ్య సంఘం, మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రంగుల పండుగ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి హోలీ వేడుకలను ప్రారంభించారు. దేవాలయ ప్రాంగణంలో ఒకరికొకరు రంగులు పూసుకుని,శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని, డప్పువాయిద్యాల మధ్య, జై వాసవి నినాదాలతో పట్టణ వీధులను హోరెత్తించారు. ఈ సందర్భంగా వాసవీమాత దేవాలయ ఫౌండర్ జూలూరి రమేష్‌బాబు మాట్లాడుతూ సమాజంలో సోదరభావాన్ని, ఐక్యతను చాటడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది లాగే ఈ సారి కూడా ఆర్యవైశ్య సోదరులందరూ ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య యువతీ యువకులు పాల్గొన్నారు.


హోలీ సంబురాలు నిర్వహించుకుంటున్న ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల నాయకులు

## రైతులకు అందుబాటులో యూరియా

**ఉప్పునుంతల, మార్చి 4 ప్రభాతవార్త :** ఉప్పునుంతల మండలంలోని రైతులకు మరోసారి 1850 బస్తాల యూరియా అందుబాటులోఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ తెలిపారు. నేడు గురువారం ఉదయం 9.00 గంటల నుంచి యూరియా ఎరువుల బుకింగ్ ప్రారంభం కానుంది. అవసరమైన రైతులు సంబంధిత కేంద్రాలకు వెళ్లి ముందస్తుగా యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. మండల పరిధిలో యూరియా నిల్వలు ఈ విధంగా ఉన్నాయి. సింగిల్ విండో ఉప్పునుంతల వద్ద 600 బ్యాగులు,ఆగ్రో రైతు సేవ కేంద్రం ఉప్పునుంతల వద్ద 300 బ్యాగులు,హాకా తాడూరు వద్ద 300 బ్యాగులు,మన గ్రోమోర్ ఉప్పునుంతలలో 450 బ్యాగులుమొత్తం 1,850 యూరియా అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్ తెలిపారు. రైతుల యూరియా కొరతను తీర్చేందుకు మరోసారి పెద్ద సంఖ్యలోబస్తాలను ముందస్తుగా నిల్వఉంచినట్లు వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ వెల్లడించారు. ఎరువులసరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. రైతులు తమ పాస్‌బుక్,ఆధార్ కార్డు వంటిఅవసరమైన పత్రాలతో సమయానికి హాజరై బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికతో కొనుగోలు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు.

## వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి ఘన సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామ అధ్యక్షులు కుమ్మరి గోవిందు

**శ్రీరంగాపూర్, మార్చి 4 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ రంగనాయక స్వామి వారి రథోత్సవ కార్యక్రమానికి విచ్చేసినటువంటి వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డిని శ్రీరంగాపూర్ గ్రామ అధ్యక్షులు కుమ్మరి గోవిందు శాలువతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. గ్రామ అధ్యక్షులు గోవిందు తోపాటు శ్రీరంగాపూర్ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఆత్మూరి మల్లమాంబ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ

**శ్రీరంగాపూర్, మార్చి 4 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో బుధవారం కవయిత్రి ఆత్మూరి మల్లమాంబ విగ్రహ ప్రతిష్ట చేయడం కోసం భూమి పూజ చేయడం జరిగింది. ఈ భూమిపూజ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పీఎస్‌ను సందర్శించిన ఏఎంఓ దుంకుడు



**భూత్పూర్,మార్చి 4,ప్రభాతవార్త :** జిల్లా విద్యాశాఖ అకాడెమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఒ) దుంకుడు శ్రీనివాస్ బుధవారం భూత్పూర్ పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మూడో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఫండమెంటల్ లెర్నింగ్ స్టడీ(ఎఫ్ఎల్ఎస్) మాక్‌టెస్ట్‌ను ఆయన పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన ప్రక్రియను ఆయన పరీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ ఠాగూర్,స్కూల్ హెచ్ఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా నదిలో యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలు

మొదటి పేజీ తరువాయి భాగం..

శ్రీనివాసులు జిపిఒ, వీఆర్ఏలకు రీచ్‌ల దగ్గర డ్యూటీలు వేసినట్లు చెబుతున్నారు. కానీ అక్కడ వారి సిబ్బందిడ్యూటీలో ఉంటే అక్రమ ఇసుక ఎలా రవాణా అవుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ సిబ్బందిని పకడ్బందీగా రీచుల దగ్గర డ్యూటీలు వేసి, పర్యవేక్షణ ఉంచి నదిలో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఇసుకను తరలిస్తున్న హిటాచిని తరలిస్తున్న దృశ్యం

**అక్రమార్కులకు అండగా అధికారులు:** ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమాలు చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్య తీసుకోవల సిన అధికారులే అక్రమార్కులకు అండగానిలుస్తు న్నారు. ఈ సంవత్సరం జనవరి 22 తారీ ఖున ఇసుక రీచ్‌ల దగ్గర ఉన్న ఐదు హిటాచిలను కృష్ణ తహసిల్దార్ సీజ్ చేశారు. ఒక్కో హిటాచికి ప్రభుత్వ జీవో ప్రకారం 50 వేల జరిమానా మొదటిసారి వేయాల్సి ఉంది. కానీ నిబంధనలకు వ్యతిరేకంగా తక్కువ అమోంటు జరిమానవేసి వదిలేసినట్లు సమాచారం.అక్రమార్కులకు తక్కువ జరిమానవేసి వదిలివేయడం వారికి అధికారులు సహకరించినట్లేనని ప్రజలు విమర్శిస్తున్నారు.

**టాస్క్ ఫోర్స్ దాడులు:** కృష్ణానది నుండి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ఒక టిప్పర్, ఐదు ట్రాక్టర్లను సోమవారం అర్ధరాత్రి టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసులను పిలిపించుకుని పట్టుబడ్డ వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించారు. విశ్వసనీయ సమాచారం టైరాడ్ అని చెప్పడంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణ ఎస్సై నవీద్ తెలిపారు.

# ఘనంగా హోలీ సంబరాలు


హోలీ వేడుకల్లో చిన్నారులు, యువకులు

**నారాయణపేట, మార్చి 4 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా ఉట్కూర్ మండల కేంద్రంలోని దేవీనగర్ వీధిలో హోలీ పండుగ సంబరాలు అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. తెల్లవారుజాము నుంచే యువత, చిన్నారులు రంగులతో వీధులను కళకళలాడిస్తూ పండుగ శోభను మరింత పెంచారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ స్నేహ సౌరభాలను చాటుకున్నారు. మహిళలు, పెద్దలు, యువకులు సమానంగా పాల్గొని దేవీనగర్ వీధిని రంగుల మయంగా మార్చారు. హాస్యవినోదాలు, సంగీతంతో సందడి నెలకొంది ఈ సంబరాల్లో బీజేపీ మాజీ మండల అధ్యక్షులు జి.రమేష్, కావలిసుధాకర్, చాకలి రణవీర్, ఎం. భగవంతు పాల్గొని గ్రామస్తులతో కలిసి రంగులాడుతూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఐక్యత, సోదరభావం నెలకొల్పే పండుగగా హోలీ ప్రత్యేకతను వారు ప్రస్తావించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా యువత స్వచ్ఛందంగా క్రమశిక్షణపాటించారు. హోలీ సంబరాలతో దేవీనగర్ వీధి ఉత్సవ వాతావరణాన్ని సంతరించుకుంది. గ్రామస్తులందరికీ ఈ పండుగ ఆనందోత్సాహాలను నింపిన సందర్భంగా నిలిచింది.

**కోయిలకొండ మార్చి 4 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కోయిలకొండలో బుధవారం యువకులు, చిన్నారులు, పెద్దలు అందరూ ఒకరిపై ఒకరురంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామానికి చెందిన యువ నాయకుడు గద్దెగూడెం నవీన్ కుమార్ హోలీ సంబరాలలో పాల్గొనడంతో ఆయన వెంట యువత సైతంవచ్చి సంబరాలలో పాల్గొని హోలీ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువ నాయకుడు నవీన్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుహోలీ పండుగఅన్నారు. హోలీ పండుగ ఐక్యతకు, సౌభ్రాతృత్వానికి ప్రతీక అన్నారు. గ్రామంలో హోలీ పండుగ ప్రశాంతవాతావరణంలో జరిగింది. హోలీ వేడుకలలో యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**దేవరకద్ర,మార్చి4 ప్రభాతవార్త:** హోలీ పండుగ సందర్భంగా హమాలీ మిత్రులు సెలవు దినాన్ని పురస్కరించుకొని అంగరంగ వైభవంగా సంబరాలు నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ పాటలు నృత్యాలతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని స్నేహ భావాన్ని చాటుకున్నారు. హోలీ పండుగ ఐక్యతకు ప్రతికగా నిలు స్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు హమాలి మిత్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.


హోలీ వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

# శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

◆ అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ◆ దోపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ఉప్పునుంతల, మార్చి4 ప్రభాతవార్త:** మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం జరిగిన దోపోత్సవం కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, సిబిఎం ట్రస్టు చైర్ పర్సన్ డా. చిక్కుడు అనూరాధలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి వేద పండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వేదమంత్రాల మధ్య, వేద పండితులచే ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్


అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అనూరాధ దంపతులను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు


మామిళ్ళపల్లిలో జరిగిన హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ,అయన సతీమణి డాక్టర్ చిక్కుడు అనూరాధతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు దంపతులు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి దంపతులు, మాజీ జెడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి దంపతులు హోమంలో పాల్గొనగా. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నర్సింహారెడ్డి, సర్పంచులు మోహన్ గౌడ్,చింత గాళ్ళ శ్రీనివాసులు,జిల్లెల జగత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాల్వ గోవర్ధన్ రెడ్డి,దాసర్లపల్లి నరసింహారెడ్డి,ఆలయ కమిటీ పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేద్దాం

### జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్యారా లీగల్ వాలంటీర్ ఎ. రూపిక

**దామరగిద్ద, మార్చి4 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యారా లీగల్ వాలంటీర్ ఎ. రూపిక విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వివాహానికి చట్టబద్ధమైన వయస్సు అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని సూచించారు. ఈ వయస్సు రాకముందే పెళ్లి చేయడంచట్టవిరుద్ధమని, అది సురక్షితంకాదని స్పష్టం చేశారు. బాల్య వివాహాలుమానసిక, శారీరక ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని, అలాగే విద్యాభ్యాసం మధ్యలో ఆగిపోవడం, నిరక్షరాస్యత, నిరుద్యోగం పెరగడం, భవిష్యత్ లక్ష్యాలు సాధించలేకపోవడం వంటి అనేక ప్రతికూల ప్రభావాలు కలిగిస్తాయని తెలిపారు. మీ గ్రామంలోఎవరైనా పిల్లలను చట్టబద్ధ వయస్సు రాకముందే వివాహం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసితే,వెంటనే స్పందించాలని కోరారు. సమాచారం ఇవ్వదలచిన వారు చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. మన మందరం కలిసి నారాయణపేటను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చుకుందామని, అబ్బాయిలు-అమ్మాయిలు బాగా చదువుకుని పెద్ద కలలు కనుతూ ఆత్మవిశ్వాసంతో జీవించే సమాజాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.


బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్యారా లీగల్ వాలంటీర్ ఎ. రూపిక

# పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

పాఠశాలలో నిర్వహణ,బోధన విధానం, విద్యార్థినుల విద్యా ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. స్లో లెర్నర్స్‌గా గుర్తించిన విద్యార్థినుల వివరాలు తెలుసుకుని, వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థినుల మార్కుల జాబితాను పరిశీలించారు. అనంతరం వంటశాలను తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని తనిఖీ చేసి, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. 10వ తరగతి విద్యార్థినులతో మాట్లాడి రాబోయే పరీక్షలకుసమర్థంగా సిద్ధం కావాలని సూచించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. అనంతరం పెద్ద మందడి మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. కాంపౌండ్‌వాల్, టాయిలెట్స్ సమస్యపై విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇందిరమ్మఇండ్ల పరిశీలపెద్దమందడి మండల కేంద్రంలో వెల్టూరు గ్రామంలో పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఇండ్ల నిర్మాణాల కోసం వారికి అవుతున్న ఖర్చు గురించి ఆరా తీశారు. ఇంటి నిర్మాణం కోసం ఎక్కడ అప్పు తీసుకోవద్దని లబ్ధిదారులకు సూచించారు.


ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ఆర్థిక ఇబ్బందులు ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలను ఇప్పించే సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. అదేవిధంగా మండల పరిధిలో ఇంకా గ్రౌండింగ్ కు నోచుకోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వెంటనే గ్రౌండింగ్ ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. త్వరలోనే పెండింగ్ బిల్లులు కూడా లబ్ధిదారుల ఖాతాల్లో పడతాయని కలెక్టర్ తెలిపారు. పెద్దమందడి మండల కేంద్రంలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో ఏమైనా సందేహాలు ఉంటే నమూనా ఇందిరమ్మ ఇంటిని సందర్శించి, ఇంజనీర్లని అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. హౌసింగ్ డిఈ విఠోభా, తహసీల్దార్ పాండు నాయక్, ఎంపీడీవో పరిణత, పాఠశాల సిబ్బంది ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.


పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్


కేజీబీవీని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

## గద్దర్ విగ్రహా ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్


గద్దర్ విగ్రహా ఆవిర్భావ సభను పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మార్చి 4 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో మార్చి 8న ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహావిష్కరణ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడిత ప్రజల హక్కుల కోసంనిరంతరం పోరాడిన వారు గద్దర్ అని కొనియాడారు. మార్చి 8న జరిగే గద్దర్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవిష్కరణ కమిటీ చైర్మన్ శర్మ ,జేఏసీ చైర్మన్ సదానంద గౌడ్,బొజ్జన్న గోపాల్,సంజీవ, రజిత, నర్సింలు, పదకంటి వెంకటేష్,మహేశ్ పాల్గొన్నారు.

## పది ట్రాక్టర్ల ఇసుక, ఒక హిటాచి సీజ్

**మాగనూర్, మార్చి4 ప్రభాతవార్త:** మండలంలోని అమ్మపల్లి గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉన్న సుమారు 10 ట్రాక్టర్ల ఇసుకను మైన్స్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పరిశీలించి సీజ్ చేసినట్లు మాగనూర్ తహసిల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. ఒక హిటాచిని కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. పక్కనే అనుమానస్పదంగా ఆగి ఉన్న ఒక కాళీ ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు.

## సిద్దయ్యపల్లిలో విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**భూత్పూర్,మార్చి4,ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటోవార్డు సిద్దయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్కూల్ విద్యార్థులు స్వయం పరిపాలనను నిర్వహించారు. డీఈఓగా రిషికుమార్,ఎంఈఓగా రూప,హెచ్ఎంగా భానుప్రసాద్, చైర్మన్‌గా ప్రేక్షశ్రీ,ఉపాధ్యాయులుగా విజయ్,సాత్విక, సాన్వి, నిహాన్సిక,నవ్యశ్రీ,ధనుష్,రిషి తమ పాత్రలకు న్యాయం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి చంచల మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు,విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు పాఠశాలల్లో స్వయం పరిపాలన ఎంతో దోహదపడుతుందన్నారు. స్వయం పాలన నిర్వహించిన ఆయా విద్యార్థుల్ని హెచ్ఎం రవి చంచల అభినందిస్తూ,వారిపై ప్రశంసల జల్లు కురిపించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయుడు సతీష్ కుమార్,పాఠశాల సిబ్బంది భారతమ్మ,అరుణ పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

మొదటి పేజీ తరువాయి భాగం..

లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో 98 మంది విద్యార్థులకు గాను 96 మంది విద్యార్థులు నేటి పరీక్షకు హాజరు కాగా, ఇద్దరు విద్యార్థులు నేటి పరీక్షకు గైర్హాజర్ అయినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షాకేంద్రాల్లో 6125విద్యార్థులకుగాను 5936 మంది విద్యార్థులు హాజరు కాగా 189 మంది విద్యార్థులు నేటి పరీక్ష గైర్హాజర్ అయినట్లుఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ తెలిపారు.

## మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి భాగం..

అరైవ్-అలైవ్"రోడ్డు భద్రత,సంక్షేమం, పిల్లల భద్రత-డ్రగ్స్ నిరోధం, రైతు సంక్షేమం, విద్య, యువత-క్రీడలు, మహిళలు, పర్యావరణం వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. మార్చి 6న ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు జరుగుతాయి. మార్చి 6 నుంచి 15 వరకు గ్రామ పంచాయతీలు,మున్సిపాలిటీల్లో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పెండింగ్ ఫైల్స్ డిస్పోజల్, క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. మార్చి 16నుంచి 31 వరకు ప్రాపర్టీ టాక్స్ వసూళ్లు చేపడతారు. జూన్ 2లోగాఇందిరమ్మ గృహప్రవేశాలు పూర్తి చేయాలని, ప్రతి మండలంలో ఒక మోడల్ హౌస్ నిర్మిం చాలని సూచించారువిద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో కార్యాలయాలు, పాఠశాలల్లో సోలార్ ఎనర్జీ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు. పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో ఏప్రిల్ 13 నుంచి 18 వరకురోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించను న్నారు. ఏప్రిల్ 20 నుంచి 24 వరకు సంక్షేమ శాఖ కార్యక్ర మాలు, మే 4 నుంచి 9 వరకువ్యవసాయ శాఖఫార్మర్ రిజిస్ట్రే షన్‌తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. మహిళలు, అంగన్‌వాడీ కేంద్రాలపర్యవేక్షణపై కూడా ప్రత్యేకదృష్టి సారించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కౌకుంట్లకు ఇందిరమ్మ కళ

(మొదటి పేజీ తరువాయి)

అయింది. మాకెంతో సంతోషంగా ఉంది. మా కుటుంబా నికి ఇది పెద్ద వరం. సర్కారు ఇల్లు కట్టుకోవడా నికి 5 లక్షలు డబ్బులు ఇవ్వడంతో పాటు, గృహప్ర వేశాలకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి రావడం మాకు సంతోషంగా ఉంది.

**ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి: ఉల్లి నరేష్ కుమార్, కౌకుంట్ల సర్పంచ్**



దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సహకారంతో కౌకుంట్ల(మండలం) గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. గ్రామ అభివృద్ధి విషయంలో దేవరకద్ర ఎమ్మెల్యే పూర్తి సహకారం అందిస్తున్నారని, అదే స్ఫూర్తితో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కౌకుంట్ల సర్పంచ్ నరేష్ కుమార్ పేర్కొన్నారు.

**20 లక్షల ఇళ్లకు తగ్గకుండా కట్టాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం: దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

దేవరకద్ర నియోజక వర్గంలో ఇందిరమ్మ ఇండ్ల మాడల్ ప్రతి మండలంలోకడుతున్నా మన్నారు. పేదవారి చిరకాల కోరిక సొంత ఇల్లు అని,ఆ కోరికను తీర్చడానికి ఇందిరమ్మ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. లబ్ధిదారులకు 4విడతల్లో ఇంటికి ఐదు లక్షల రూపాయలుఇస్తున్నామని స్పష్టంచేశారు. రాబోయే మూడు ఏళ్లలో 20లక్షల ఇళ్లకుతగ్గకుండా కట్టాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం

● జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ● నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హెచ్చరిక

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి4 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లాలో మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం నిర్వహించనున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని, కార్యక్రమం అమలులో నిరక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను హెచ్చరించారు. కార్యక్రమ అమలులో అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, అదనపు ఎస్పి వెంకటేశ్వర్లులతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేరువయ్యే విధంగా రూపొందించిన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి శాఖ అధికారికి బాధ్యత అని కలెక్టర్‌పేర్కొన్నారు. 99 రోజులపాటు చేపట్టనున్న ఈ కార్య



అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

క్రమంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలపై అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడం, పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల పురోగతిపై నివేధికలు సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై నమూనాగా నిలిపేలా సమష్టి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమ అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని మరోసారి స్పష్టం చేశారు. రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలపై కలెక్టర్ శాఖల వారీగా అధికారులకు వివరించారు. కార్యాలయాలకు అధికారుల సమయపాలన పాటించి హాజరుకావాలని హాజరుకాని సిబ్బందిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ సదుర్ల శేఖర్‌కు ఘన సన్మానం



36వ డివిజన్ కార్పొరేటర్ సదుర్ల శేఖర్‌ను సన్మానిస్తున్న నాయీమిత్ర మండలి

**మహబూబ్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త:** నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని నాయీ మిత్ర మండలి జాతీయ కన్వీనర్ లయన్ అశ్విని చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 36 వ డివిజన్ కార్పొరేటర్‌గా విజయం సాధించిన సదుర్ల శేఖర్‌కు నాయీ మిత్ర మండలి ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నాయీ మిత్ర మండలి జాతీయ కన్వీనర్ లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు విద్య, వైద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాల చేయూత ను అందించాలన్నారు. ముఖ్యంగా నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ కు సత్వరమే పాలక కమిటీని నియమించి వృత్తి దారులకు ఆర్థిక సహకారం అందించాలన్నారు. అదేవిధంగా నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్పొరేటర్ సదుర్ల శేఖర్ మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా డివిజన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయీ మిత్ర మండలి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు ఈర్లపల్లి అశోక్ కుమార్, సమన్వయ కర్త యం.వి.రమణ, ఉద్యోగుల ఆర్థిక సంఘం అధ్యక్షులు సదుర్ల ప్రసాద్, విశ్రాంత యంఆర్ఓ ఎల్.గంగాధర్, విశ్రాంత ఏఈఓ, యం.కృష్ణయ్య, నాయీ యువత అధ్యక్షులు మణి పాలరాము, నాయకులు రాఘవేందర్, సుధాకర్, అశ్విని సతీష్ కుమార్, పాతూరి రవి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి : జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి4 ప్రభాతవార్త:** తాడూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించి, రోగులకు నాణ్యమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ఔట్‌పేషెంట్ విభాగాన్ని సందర్శించి, రోగులతో నేరుగా మాట్లాడి చికిత్స విధానం, ఔషధాల లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రక్త నమూనా పరీక్షల విభాగాన్ని పరిశీలించి, రోజుకు ఎంతమందికి పరీక్షలు నిర్వహిస్తున్నారో, ఫలితాలు ఎంత సమయంలో అందిస్తున్నారో ఆరా తీశారు. పరీక్షల నిర్వహణలో ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలోని ప్రసూతి విభాగం, ఇంజెక్షన్ గది, ఔషధ నిల్వ గది తదితర విభాగాలను పర్యవేక్షించిన కలెక్టర్ రోగుల రికార్డులు, హాజరు రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, ప్రభుత్వ పథకాల అమలు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సమయానికి వైద్యం అందించడమే ప్రాథమిక లక్ష్యమని పేర్కొన్న ఆయన, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

## టీపీసీసీ కోఆర్డినేటర్ ధార భాస్కర్ అరెస్ట్

■ అక్రమాలు చేసిన వారిని వదిలేసి నన్ను ఎందుకు అరెస్టు చేస్తున్నారంటూ ప్రశ్న..





భాస్కర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

**జడ్చర్ల, మార్చి 4 ప్రభాతవార్త :** టిపిసిసి కోఆర్డినేటర్ ధార భాస్కర్ ను పోలీసులు అరెస్ట్ చేయడంతో జడ్చర్లలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. దార్భాస్కర్ నమోదు చేసిన అక్రమ కేసుల గురించి, జడ్చర్ల ఎమ్మెల్యే సోదరుడు జనంపల్లి దుశ్యంత్ రెడ్డి చేస్తున్న అక్రమాలను బహిర్గతం చేస్తూ మీడియా సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవుతున్న సమయంలో అరెస్ట్ చేయడంతో మరింత చర్చకు దారితీసింది.

**అసలేం జరిగింది..? :** జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ దగ్గర ఈరోజు మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు ముందుగానే ప్రకటించారు. అయితే సమావేశం ప్రారంభం కాకముందే పోలీసులు జోక్యం చేసుకుని ధార భాస్కర్‌ను ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ దగ్గరే అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ సమయంలో ధార భాస్కర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమాలు చేసే వారిని అరెస్ట్ చేయాలి.. అక్రమాలను బయటపెట్టే నన్నెందుకు అరెస్ట్ చేస్తున్నారు?" అంటూ పోలీసులను ప్రశ్నించారు. శాంతియుతంగా మీడియా సమావేశం పెట్టడం తన హక్కుఅని మీడియా సమావేశం పెట్టనీయకుండా ముందస్తు అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ అనంతరం పోలీసులు ఆయనను మహబూబ్ నగర్ ఎస్పీ కార్యాలయానికి తరలించిన్నట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. దారా భాస్కర్ మీడియా ముందుకు వచ్చి అసలు ఏం జరిగింది.. ఎందుకు తనను అరెస్టు చేశారు.. అక్రమ కేసులు తనపై పెట్టడానికి గల కారణాలు పూర్తి వివరాలు తెలుపాల్సి ఉన్నది.

## చెరువులో పడి గురుకుల విద్యార్థి మృతి

**అయిజ మార్చి 4, ప్రభాతవార్త;** మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజు 16 అనే డిగ్రీ చదువుతున్న గురుకుల పాఠశాల విద్యార్థి ప్రమాదవశాస్తూ చెరువులో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా షాద్ టీవీనగర్ పరిధిలోనిగల మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న రాజు మంగళవారం నాడు హోలీ సందర్భంగా సెలవు ఉండడంతో నలుగురు విద్యార్థులతో కలిసి చెరువులో ఈత కొట్టడానికి వెళ్లిన రాజు మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు బయటకు రాలేదుని కుటుంబ సభ్యులు గురుకుల పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో దీంతో పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బృందాలనురంగంలోకి దిగిబుధవారం మధ్యాహ్నం విద్యార్థి శవాన్ని బయటకి తీశారు. చెరువు నుండి శవం బయటికి రాగానే విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు స్నేహితుల వారి ఆక్రందనలతో ప్రాంతమంతా మిన్నంటాయి.

## అంగన్వాడి, ఆరోగ్య కేంద్రాలను పరిశీలించిన సర్పంచ్

**దేవరకద్ర, మార్చి4 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామంలోని అంగన్వాడి సెంటర్‌ను, ఆరోగ్య కేంద్రాలను ముచ్చింతల గ్రామ సర్పంచ్ సంగిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ గద్దె నితిన్ కుమార్‌లు ఆకస్మికంగా సందర్శించి, పలు అంశాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, హాజరు నమోదు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని సెంటర్ సిబ్బందితో మాట్లాడి సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. చిన్నారుల భవిష్యత్తు కోసం అంగన్వాడి కేంద్రాలు కీలకమని గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు పోషకాహారం గుడ్లు, పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని సర్పంచ్, ఉప సర్పంచ్ సందర్శించి, సేవల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు మందుల లభ్యత వైద్య సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిశుభ్రత తాగునీటి సదుపాయం వైద్య పరికరాల వినియోగంపై వివరాలు తెలుసుకొని అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని సర్పంచ్, ఉపసర్పంచ్ స్పష్టం చేశారు. తదనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రతి ఒక్కరికి బీపీ షుగర్ మిగతా వ్యాధులు పరిశీలించి, మెడిసిన్ ఇవ్వాలని వైద్య అధికారికి, ఆశా వర్కర్‌కి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజనాదేవి, కాంగ్రెస్ నాయకులు ఉల్లి రాజు, కావలి అనురాధ, ఉల్లి గోవిందమ్మ, బోయ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంను విజయవంతం చేయాలి

■ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల మార్చి4, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 99 రోజులపాటు నిర్వహించు ప్రజాపాలన... ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ మాట్లాడుతూ ఈనెల5న మండల స్థాయిలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు వివిధశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి 99 రోజుల కార్యక్రమాలపై ప్రణాళిక తో ముందు కెళ్లాలన్నారు. ప్రభుత్వం 10 అంశాలతో ఐదు దశల్లో నిర్దేశిత తేదీలలో ఆయా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందున అందుకు అనుగుణంగా ప్రణాళికను రూపొందించుకోవాలని ఆదేశించారు. మార్చి 6వ తేదీన గ్రామ స్థాయిలో గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించాలన్నారు. ఆయా శాఖల పరిధిలో వివిధ సంక్షేమ పథకాల అమలు, చేపట్టిన అభివృద్ధి పనుల నివేదికలను సమగ్రంగా రూపొందించి సమర్పించాలన్నారు. భూభారతి, ట్రేడ్ లైసెన్స్, భవన నిర్మాణాల అనుమతులు, తదితర అన్ని దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి కార్యాలయం మొదలుకొని అన్ని గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ తరపున చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. జోగులాంబ గద్వాల జిల్లా ఎన్సిడి స్క్రీనింగ్ లో, టీబీ పరీక్షల్లో చాలా వెనుకబడిందని, 99 రోజుల కార్యాచరణలో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ప్రతి గురువారం మండల స్థాయిలో ఇందిరమ్మ ఇళ్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వంద శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. వ్యవసాయం, మహిళా సంక్షేమం, యువత, పర్యావరణం, తదితర విషయాల్లోనూ ప్రణాళిక బద్దంగా ముందుకెళ్లి జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో ముందుండేలా సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ 99రోజుల ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం చేసేందుకు తమ శాఖ తరపునఅవసరమైన సహాయ, సహకారాలను అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా కట్టడి చేశామని, ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకుపాల్పడే వారిపైకఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో అరైవ్.. అలైవ్ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, పోలీస్ శాఖ తరపున ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళిక బద్దంగా ముందుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్డిఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్నా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్, హాజరైన అధికారులు

## పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : జిల్లా కలెక్టర్

**గద్వాల మార్చి 4, ప్రభాతవార్త:** పదవ తరగతి ఫలితాలు మెరుగుపర్చడంతో పాటు పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసీ సమావేశం హాల్‌నందు పదవ తరగతి పరీక్షల సన్నాహాలు, పాఠశాలల నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్. మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను పూర్తిగా సిద్ధం చేసి మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సి, డి కేటగిరీల్లో ఉన్న విద్యార్థులకు ప్రత్యేకతరగతులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా గణితం, తెలుగు, హిందీ వంటి సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలను విద్యార్థులతో సాధన చేయించి, పరీక్షలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పకుండా పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు తాను స్వయంగా రాసిన విజయోస్తు లేఖలను ప్రతి విద్యార్థికి అందజేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలనతో విధులకు హాజరై విద్య ప్రమాణాలను మెరుగుపరచాలని తెలిపారు. పాఠశాలల్లో అమలవుతున్న పీఎంపోషణ్ పథకం వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలన్నారు. విద్యార్థుల ఆపర్ ఐడీ జనరేషన్ పూర్తి చేయడంతో పాటు ఆధార్ ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూఫుడ్ పాయిజనింగ్ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీ, పంపిణీ సమయంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆహారం నాణ్యతతో పాటు వంటశాల మరియు పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇతర వ్యక్తులను అనుమతించకూడదని స్పష్టం చేశారు. అన్ని మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల చదువు, భద్రత, ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, కేజీబీవీ, రెసిడెన్షియల్ ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి విజయోస్తు లేఖను అందజేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

# ఉత్సాహంగా హోలీ వేడుకలు

◆ రంగుల మయంగా పల్లెలు పట్టణాలు ◆ ఆటలు నృత్యాలతో ఆడి పాడిన చిన్నారులు, పెద్దలు



హోలీ వేడుకల్లో యువకులు, మహిళలు, చిన్నారులు



**మహబూబ్‌నగర్, మార్చి4 ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హోలీ సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఏడాది గ్రహణం సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో మంగళవారం హోలీ వేడుకలు జరుపుకోవాలని బుధవారం రోజు పెద్ద ఎత్తున రంగుల పండుగను నిర్వహించారు. గ్రామ గ్రామాన హోలీ వేడుకలు చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుంటు ఊరూవాడా వర్ణశోభితమైంది. ముఖ్యంగా యువతీయువకులు సంబురాల్లో మునిగిపోయారు. చాలా మంది ఒకరికొకరు రంగులు గుప్పుతూ సెల్ఫీలు దిగుతున్నారు. స్మార్ట్‌ఫోన్‌లలో ఫోటోలు తీస్తూ ఆనందంగా హోలీ సంబరాలు జరుపుకొన్నారు.



భూత్పూర్ పట్టణ కేంద్రంలో హోలీ సంబరాల్లో పాల్గొన్న నాల్గోవార్డు కౌన్సిలర్ గడ్డం ప్రేమ్‌కుమార్

# కాగితం మీదే..లేఅవుట్

◆ జిపి ల్యాండ్ వదలలేదు.. నాలా పర్మిషన్ అసలే లేదు

◆ ఎకరాను గజాలుగా మార్చి విక్రయం ◆ అనుమతుల్లేకుండా వెంచర్

బొల్లారంలో భూదందా

**దేవరకద్ర, మార్చి 4 ప్రభాతవార్త:** నాలా పర్మిషన్ లేకుండా.. 10 జిపి ల్యాండ్ (ఓపెన్‌స్పేస్ ) వదలకుండా వెంచర్ అనుమతులు అసలే తీసుకోకుండా.. కేవలం కాగితం మీదే లేఅవుట్ చేసి ఎకరా పొలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న ఘటన దేవరకద్ర మండలం బొల్లారంలో వెలుగు చూసింది. దేవరకద్ర మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్‌పై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ రహదారి పక్కన భూమి సర్వే నం.137లో 1.06 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ ఏర్పాటు చేసి, అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ప్లాటు రూ.6 లక్షలు..1.06 ఎకరాలను 5566 చ.గజాలుగా మార్చి మొత్తం 23 ప్లాట్లుగా విభజించారు. ఒక్కో ప్లాటును 181 గజాల చొప్పున లేఅవుట్ చేసి, ఒక్క ప్లాటును రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ వెంచర్‌కు గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, కనీసం పంచాయతీకి కేటాయించాల్సిన 10శాతం ఓపెన్ స్పేస్‌ను కూడా వదలలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది కొనుగోలుదారులు నగదు చెల్లించి ప్లాట్లు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. రహదారి పక్కనే ప్లాట్ల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంచర్‌లో కనీసం 25 అడుగుల వెడల్పుతో రోడ్లు ఏర్పాటు చేయాలి. అయితే ఇక్కడ కేవలం 15 అడుగుల రోడ్లు మాత్రమే వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదికాక, కోయిల్సాగర్ సమీపంలో ఉన్న ఈ భూమిలో రోడ్డు నుంచి కనీసం 50 అడుగుల మేర స్థలం వదలాల్సి ఉండగా, 30 అడుగులు కూడా వదలకుండా ప్లాట్లు రూపొందించినట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై బొల్లారం గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను వివరణ కోరగా, ఈ వెంచర్‌కు పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. రెవెన్యూ అధికారులదే పాత్ర..? అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు, రిజిస్ట్రేషన్లు జరగడం పై రెవెన్యూ అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం గుంటల వారీగా రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకపోయినా, మధ్యవర్తి ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.8 వేలు వసూలు చేస్తూ వ్యవహారం జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో అధికారులకు కూడా డబ్బులు అందుతు న్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో అక్రమంగా సాగుతున్న ఈ వెంచర్‌పై వెంటనే విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల విక్రయాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




లే అవుట్